

గుంత.. తీరిన చింత

హుస్నాబాద్, అక్కన్నపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు తోటపల్లి స్టేజీ వద్ద గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం జాన్‌విల్సన్ ఆటో యూనియన్ డ్రైవర్లు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చారు. వారిని వాహనదారులు అభినందించారు. - హుస్నాబాద్‌రూరల్



లీకేజీలు అరికట్టరూ..?

అక్కన్నపేట మండలకేంద్రంలో మిషన్ భగీరథ నీరు కలుషితమవుతోంది. స్థానిక బస్టాండ్ ఆవరణలో కొన్ని రోజులుగా పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. - అక్కన్నపేట (హుస్నాబాద్)



'శ్రావణ' సందడి

శ్రావణ మాసం చివరి సోమవారం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం సందడిగా మారింది. - హుస్నాబాద్‌రూరల్

క్లుప్తంగా

రైతులు కొత్త రుణాలు తీసుకోండి



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏఓ వసంతరావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రుణమాఫీ జమ అయిన రైతులు కొత్త పంట రుణాలు తీసుకోవాలని ఏఓ వసంతరావు సూచించారు. సోమవారం మండలంలోని ఎస్‌బీఐ, డీసీసీబీ, ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్లతో చర్చించారు. మండలంలో 2,826 మంది రైతులకు రూ.13 కోట్ల రుణ మాఫీ డబ్బులు జమ అయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు 15 వందల మంది రుణ మాఫీ అయిన రైతులు కొత్త పంట రుణాలు తీసుకున్నారని తెలిపారు. అనంతరం జగదేవ్‌పూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు నూతన ఎస్‌ఐగా షేక్ యూనుస్ అహ్మద్ అలీ సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

'బీమాను వినియోగించుకోండి'

హుస్నాబాద్: బ్యాంకు ఖాతాదారులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన లాంటి ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని యూకో బ్యాంక్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి స్వనిధి సే సమృద్ధి క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ రాజు, ఆర్పీలు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి పేర్కొన్నారు. పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణం ప్రమాదాలకు దారి తీస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



లక్ష్మణ్‌ను పరామర్శిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్‌ను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. సోమవారం జిల్లా నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రెండు రోజుల క్రితం లక్ష్మణ్ తండ్రి మరణించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కనుకుంట్ల శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల అభ్యున్నతే ధ్యేయం

మిరుదొడ్డి(దుబ్బాక): అన్నిరంగాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం అన్నారు. మిరుదొడ్డిలో అత్యాధునిక హంగులతో నిర్మించిన నూతన ఎంపీడీఓ భవనాన్ని సోమవారం ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వైస్ చైర్మన్ పోలీస్ రాజులు, ఎంపీడీఓ రాజిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్, ఎంపీఓ జహీరొద్దీన్, సర్పంచ్ రాములు, నాయకులు పాల్గొన్నారు.

జీపీ నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశ నాయక్‌తండా నూతన పంచాయతీ భవన నిర్మాణ స్థల వివాదానికి తెర పడింది. సోమవారం సర్పంచ్ రవీందర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీఓ కవికుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. క్రీడా ప్రాంగణం పక్కన దాదాపు 4 గుంటలలో నూతన పంచాయతీ భవనం నిర్మించేందుకు గ్రామస్తులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారని తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే సతీష్‌కుమార్ చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

'కల్యాణలక్ష్మి' కొండంత అండ

● హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: రాష్ట్రంలో పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారురులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు సంక్షేమం గురించి ఆలోచించలేదని, ఆడపిల్లల వివాహాలకు రూ.1,00,116 అందించిన ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ప్రజాప్రతినిధులు,



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అధికారులు, ప్రజల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ భూక్య మంగ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

చేర్యాల(సిద్దిపేట): గర్భిణులు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పోచమ్మవీధి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజూ తీసుకునే ఆహారంలో అన్నం తగ్గించుకొని చిరుధాన్యాలు తీసుకోవాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోండి

అక్కన్నపేట(హుస్నాబాద్)/దౌల్తాబాద్(దుబ్బాక)/కొండపాక(గజ్వేల్): ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైందని, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంజీవ్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అలాగే దౌల్తాబాద్ మండలంలోని లింగరాజుపల్లి ఎంజేపీ బాలుర కళాశాల, శేరిపల్లిబందారం ఎంజేపీ బాలికల కళాశాల, మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలో ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. కొండపాక మండలంలోని ప్రభుత్వ



కొండపాక: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

జూనియర్ కళాశాల, సత్యసాయి జూనియర్‌బాలికల కళాశాల, గురుకుల పాఠశాలలో తహసీల్దార్ శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఆలయ సఫాయి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలయ రాజగోపురం ఎదుట సోమవారం కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కార్మికులు ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి సంఘీభావం తెలిపారు. రూ. కోట్ల ఆదాయం ఉన్న మల్లన్న ఆలయానికి 62 మంది సఫాయి కార్మికులు చేస్తున్న కష్టానికి జీతాలు చెల్లించేందుకు డబ్బులు లేవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరి



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రవీందర్, నాయకులు మల్లేశం, మేకల కృపాకర్, ఆరుట్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్‌లో సోమవారం మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం యంత్ర ప్రతిష్ఠ, మూలమంత్రహోమం, శివపార్వతుల కల్యాణోత్సవంతో పాటు తీర్థప్రసాద వితరణ చేశారు. సర్పంచ్ లక్ష్మీ రమేష్ దంపతులు భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలు నిర్మించుకోవడం ఆధ్యాత్మికతకు నెలవు అన్నారు. కార్యక్రమంలో ఏఎసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎం



పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, పద్మశాలి సంఘం నాయకులు శ్రీశైలం, సత్యనారాయణ, లక్ష్మణ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రత్యేక పూజలు

దుబ్బాకటౌన్: శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి శావ ఊరేగింపు (ఉత్సవ విగ్రహాల) వైభవంగా జరిగింది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నీలకంఠ సమాజం సభ్యులు స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, తదితరులు పూజలు నిర్వహించారు.

సనాతన ధర్మాన్ని కించపరిస్తే ఊరుకోం



ఉదయనిధి ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేటకమాన్: సనాతన ధర్మాన్ని కించపరిచే విధంగా ఎవరూ మాట్లాడినా సహించేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉదయనిధి స్టాలిన్ వెంటనే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. హిందువులు ఐకమత్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఉపేందర్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, వేణుగోపాల్, పద్మ, సుగుణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వివక్ష సరికాదు



ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు

మిరుదొడ్డి(దుబ్బాక): అర్హులైన బీడీ కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని హెచ్ఎంఎస్ (హిందూ మజ్దూర్ సభ) జిల్లా అధ్యక్షుడు ఈదారి మల్లేశం డిమాండ్ చేశారు. పీఎఫ్ నంబర్ కలిగి ఉన్న ప్రతి బీడీ కార్మికులకు జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ రాజిరెడ్డికి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు పెన్షన్లు మంజూరు చేసే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు లక్ష్మణ్, మధు, కరుణాకర్ బీడీ కార్మికులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

దౌల్తాబాద్(దుబ్బాక): భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందామని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్న గారి శంకర్ అన్నారు. సామాజిక పరివర్తన పాదయాత్ర రెండో రోజు మండలంలోని లింగ్మలాపూర్‌కు సోమవారం సాయంత్రం చేరుకుంది. ఈసందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'

దుబ్బాకటౌన్: కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన బీజేపీ నాయకుడు రఘోత్తంపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డికి త్రీవీలర్ మోటర్ సైకిల్ కోసం రూ. లక్ష చెక్కును అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

హుస్నాబాద్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఎదురుగా కాంగ్రెస్ కార్యాలయాన్ని సోమవారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అలాగే నూతన గృహ ప్రవేశం చేశారు. కార్యక్రమానికి సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి, సత్యనారాయణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, ఆది శ్రీనివాస్, తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. ప్రజలు ఆశీర్వదిస్తే హుస్నాబాద్ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేస్తానని



మహిళలతో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రఘునందన్‌రావు బీసీల ద్రోహి

దుబ్బాక: బీసీలు, దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు లేదని బీసీ బంధు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేయలేని సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తే సంతోషించాల్సింది పోయి రాజకీయాలు చేయడం దారుణమన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని సబ్బండవర్గాల అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి,



మాట్లాడుతున్న బీసీ బంధు లబ్ధిదారులు

ఇల్లెందుల శ్రీనివాస్, బత్తుల స్వామి, బీఆర్ఎస్ నాయకులు భూంరెడ్డి, రామస్వామి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషిచేసి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లింగాల నిర్మల అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎక్కడా లేని విధంగా దళిత, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించిందన్నారు. దాచారంలో తొలగించిన వాటర్ ట్యాంక్ మట్టితో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఎంపీటీసీ రాజు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈక్రమంలో ఏఈతో స్వల్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

వాగ్వాదం జరిగింది. సమావేశంలో జెడ్పీటీసీ కవిత, ఏఎంసీ చైర్మన్ చంద్రకళ, ఎంపీడీఓ రాము, పీఆర్‌డీఈ సదాశివరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు అపహరణ

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని తాడూరులో గుర్తుతెలియని దుండగుడు బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కొల్ల భారతలక్ష్మీ ఇంటి నుంచి బయటకు రాగా మాస్క్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె ముఖంపై నీళ్లు చల్లి మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకొని పారిపోయాడు. సోమవారం చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి



సమ్మెలో అంగన్‌వాడీ ఉద్యోగులు

దుబ్బాక: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ విధానాలు మానకుంటే రానున్న రోజుల్లో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు నాగరాణి, పద్మ, విజయ, పుష్ప, చంద్రకళ, మంజుల, కవిత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం

మర్కూక్(గజ్వేల్): ఉపాధ్యాయుడు నరేందర్ సేవలు అభినందనీయమని ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంగడి కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు నరేందర్ నాలుగు ఫ్యాన్లు, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్సిల్స్‌ను అందించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, హెచ్ఎం ఓంకార్, ఎస్ఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ భూమి పూజ

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని రేబర్తిలో నిర్మించనున్న పల్లె దవాఖానకు సోమవారం సర్పంచ్ నాంపల్లి సవిత చంద్రశేఖర్ భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ డాకూరి లక్ష్మీ వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

◆ సరిపడా యూరియా అందించాలి

హుస్నాబాద్: రైతులకు యూరియా కొరత లేకుండా సరిపడా అందించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి డిమాండ్ చేశాడు. సోమవారం వ్యవసాయ డివిజన్ అధికారి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు.

◆ జర్నలిస్టు కుటుంబానికి చేయూత

గజ్వేల్: పట్టణంలో కొన్ని రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన జర్నలిస్ట్ వేణుమాధవ్ కుటుంబానికి మంత్రి హరీశ్‌రావు అండగా నిలిచారు. సోమవారం రూ. 2లక్షల నగదు సాయాన్ని పంపించగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గజ్వేల్‌లో మృతుడి భార్య విజయకు అందజేశారు.

◆13న మత్స్యకారుల చైతన్య సదస్సు

బెజ్జంకి(సిద్దిపేట): ఈనెల 13వ తేదీన మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే మత్స్యకారుల చైతన్య సదస్సును విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు పెసరు కుమారస్వామి పిలుపునిచ్చారు. బెజ్జంకిలోని పెద్దమ్మ ఆలయం వద్ద సోమవారం మండల అధ్యక్షుడు పోచయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

◆ పంటల పరిశీలన

మర్కూక్(గజ్వేల్): రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ నాగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి పంటలను పరిశీలించి మాట్లాడారు. పత్తిలో నీరు నిలవడం వల్ల పంటకు నష్టం జరిగే అవకాశం ఉందని వివరించారు.

◆ 5,827 మందికి రుణమాఫీ

దుబ్బాక: దుబ్బాక మండలంలో 5,827 మంది రైతుల ఖతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేసిందని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ పూర్తి వివరాలను ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

◆ 'డబుల్' నిర్మాణాలు పూర్తిచేయాలి

రాయపోలు(దుబ్బాక): మండలంలోని వడ్డేపల్లిలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని సామాజిక పరివర్తన యాత్ర బృందం సభ్యులు కోరారు. యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని వడ్డేపల్లిలో పర్యటించారు.

◆ వైన్స్‌షాపును మార్చాలి

దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రెండు వైన్స్ షాపులు ఎదురెదురుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య అధికమై ప్రమాదాలు జరుగుతున్నాయని దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్ అన్నారు. సోమవారం గ్రామస్తులతో కలిసి ఒక వైన్స్ షాపును గజ్వేల్ రోడ్డుకు మార్చాలని సిద్దిపేటలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

◆ వెండి శివలింగం ప్రతిష్ఠ

హుస్నాబాద్: కాశీ మరకత లింగేశ్వర ఆలయానికి మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతారావు తనయులు రాజేశ్వర్‌రావు, సంజీవరావు నాలుగున్నర కిలోల వెండి శివలింగం బహూకరించారు.

◆ ఏకగ్రీవ తీర్మానం

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ముదిరాజ్, గౌడ సంఘం సభ్యులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామని సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన పత్రాన్ని సోమవారం మంత్రి హరీశ్‌రావుకు అందజేశారు.

◆ చౌదర్‌పల్లిలో 'కనువిప్పు'

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట- భూంపల్లి మండలం చౌదర్‌పల్లిలో సోమవారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ భువనేశ్వర్‌రావు మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు తెలపకూడదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్ పాల్గొన్నారు.